77

# కాయకల్ప చికిత్స

చెట్లకు ప్రాణం ఉన్నదని జగదీశ చంద్రబోసు ప్రకటించినప్పుడూ, లోహాలు కూడా అలసిపోతాయని హెర్బర్ట్ మిల్లర్ రుజువు చేసినప్పుడూ, చాలా మంది నమ్మలేదు. ఇప్పటికీ నమ్మనివారున్నారనుకోండి. ఆనాడు ఈ రెండు సిద్ధాంతాలను 'నిజం' అన్నవారిని మూర్ఖులంటే, ఈనాడు అలా అననివారిని మూర్ఖులంటున్నాం.

'ప్రాణం' స్వభావం మార్పుచెందదడం, అలసిపోవడం ప్రాణికున్న లక్షణాల్లో వొకటి. లోహాలు అలసిపోతున్నాయంటే అవీ ప్రాణులే అనుకోవాలి. కానీ ఈ ప్రాణం మనకు తెలిసింది, మనకు పరిచయమయిందీ కాకపోవచ్చు.

వైద్య శాస్త్రంలో వొక విచిత్రమైన ప్రక్రియ ఉన్నది. అదే వృద్ధాప్యాన్ని వివిధ మార్గాల ద్వారా తగ్గించడం. దీన్ని ఆ శాస్త్ర పరిభాషలో 'కాయకల్ప చికిత్స' అంటారు. కాళ్లు, చేతులు జవసత్వాలను కోల్పోయి, ఓపిక ఉడిగి, కూచుని లేవలేని వారు కూడా, ఈ చికిత్స ద్వారా పునర్ యవ్వనం పొందుతారుట. పూర్వకాలం మహారాజులు, చక్రవర్తులు, రాజులు, నవాబులు, కోటేశ్వరులు ఇలాంటి కాయల్ప చికిత్స కోసం ధనరాసుల్ని వెచ్చించారని చెబుతారు. ఇప్పటికీ ఇందుకోసం తపన పడుతున్న వారూ ఉన్నారు. దిగజారిపోతున్న యవ్వనానికి కళ్లాలు వేసి నిలిపి ఉంచాలన్నదే ఈ చికిత్స వెనుక గల రహస్యం!

మీకూ ఇలాంటి చికిత్స కావాలంటే రజాక్‌ను సంప్రదించండి. అతను చేసే కాయకల్ప చికిత్సకు లక్షలూ, వేలూ, వందలూ అవసరం లేదు. అర్ధరూపాయి వైద్యమూ ఉంది. ఐదారు వందల వైద్యమూ ఉంది. అయితే ఈ చికిత్స అతను మీకు చేయడు. మీ పాత్రసామానుకు చేస్తాడు.

''నేనీ విద్య ఎక్కడో నేర్చుకోలేదు... అదంతా వో తమాషా లెండి!'' అన్నాడు రజాక్ కొలిమిలో గుప్పెడు బొగ్గులు వేస్తూ.

రజాక్ చిన్నతనమంతా గుంటూర్లో గడిచిపోయింది. వాళ్ళు ఆరుగురు అన్నదమ్ములు. నలుగురు అప్పచెల్లెళ్ళు. మగపిల్లల్లో ఇతను నాలుగోవాడు. రజాక్ నాన్న పేరు సత్తార్. ఆ రోజుల్లో వారు నల్ల చెరువు పక్కన వుండేవారట.

''మా నాన్నకో గుర్రబ్బండీ ఉండేదండీ! అదే మాకు జీవనాధారం. రోజుకు అయిదారు రూపాయల దాకా మా నాన్న బాడిగ తోలేవాడు. గుర్రానికి గడ్డికయితేనేం, దాణాకయితేనేం ఓ రూపాయి, రూపాయి పావలా ఖర్చయ్యేది. మిగిలింది మా కుటుంబానికి అస్తుబిస్తుగా వుండేది'' అన్నాడు రజాక్.

రజాక్ పెద్ద అన్నయ్య కూరల మార్కెట్టులో పనిచేసేవాడట. రెండోవాడు ఓ మెరుగుకొట్టులో కుర్రాడుగా ఉండేవాట్ట. తయారైన బంగారు వస్తువులకు మెరుగుపెట్టడం, ఆ కొట్టువారి పని. పటికనార్చిన వస్తువును ఈ కొట్లో ఇస్తే, ముందుగా మెరుగు ఇసికతో రుద్దడం, తరువాత బ్రష్‌తో కుంకుడు నురుగు వేసి కొట్టడం, ఆ తరువాత కడ్డీ మెరుగు, ఆపైన పొడరు మెరుగు... ఇలా సాగేది ఆ ప్రోసెస్. మూడోవాడు తీగెలమిషను దగ్గర పనిచేస్తే రోజుకు పావలా ఇచ్చేవారు.

చిన్నతనంలో రజాక్ చస్తే పనిచేసేవాడు కాదు. వేళకింత తిని బలాదూర్ తిరగుతుండేవాడు. అలా తిరగడంలోనే వొకసారి గాంధీ పార్కు దగ్గర గారడీ ఆట కంటపడింది. ఆ గారడీ చేస్తున్నవాడు కూడా సాయిబే. కొయ్యబొమ్మల్ని ఆడించడం, ముక్కులోనుంచి రూపాయల్ని పిండడం, గ్లాసులో ఉన్న ఎర్రనీళ్ళను ఇంకో గ్లాసులోకి పంపుతూ వాటిని నీలం రంగుగా మార్చడం చూసి, రజాక్ చిత్తు చిత్తయిపోయాడు.

అంతే సంగతులు!

ఆ గారడీ వాడి వెంట పడ్డాడు తను. అప్పటికతని వయస్సు 14, 16 దాకా ఉంటాయేమో.

“ఆ పట్టు పట్టు, మూడు నాలుగేళ్ళపాటు అతనితోనే తిరిగాను. అతని మూటలు మోశాను. సంచులు మోశాను. పిల్లల్ని మోశాను. వంటవండాను. కాళ్ళు పిసికాను. అడ్డమైన చాకిరీ చేశాను. ఏవో చిన్న చిన్న ట్రిక్కులు చెప్పాడుగానీ, ముఖ్యమైనవి చెప్పలేదండీ. ఎప్పటికైనా చెబుతాడని నా ఆశ!” అన్నాడు రజాక్.

ఆ ఆశ తీరలేదు. రాజమండ్రిలో కోటగుమ్మం దగ్గర గారడీ చేస్తున్నప్పుడు - ఏదో చిన్న పొరపాటు జరిగింది. అంతే! చావబాది వదిలిపెట్టాడతను. ముక్కువెంట నెత్తురు కారింది. వొళ్ళంతా కదుములు కట్టింది. సరాసరి గోదావరి దగ్గరికెళ్ళి వొళ్ళు కడుక్కున్నాడు. చచ్చిపోదామనుకున్నాడు. సుడులతో, నురుగులతో తెక్కెళ్ళాడుతూ పారుతున్న ఆ ప్రవాహాన్ని చూసి రజాక్ హృదయం బెంబేలెత్తిపోయింది. భయం వేసింది. కాళ్ళీడ్చుకుంటూ ఊరి ముఖం పట్టాడు.

“అదేదో హొటల్ పక్కన, తిత్తి ఊదుతూ, బొగ్గులు వేస్తూ, చుట్టూ పాత్రసామాను పెట్టుక్కూచున్న ముసలాయన కనిపించాడు. అతనూ మా వాడేనండీ” అన్నాడు రజాక్.

అక్కడ అతుక్కుపోయాడు రజాక్. ఎన్నడూ తిత్తులూదని వాడు, ఎప్పుడూ తిత్తినోరు మూయాలో, ఎప్పుడు దాన్ని కిందికి నొక్కలో తెలియని వాడు, అలాగే తంటాలు పడ్డాడు. తిత్తులూదడం నేర్చుకున్నాడు.

“వాళ్ళు దానవాయిపేటలో ఉండేవారండి. మా గురువుగారి పేరు జహంగీర్, చాలా మంచివాడు. తిత్తులూదడం, నవాసాగరం పొడుం చేయడం, తగరం కరిగించి బిళ్ళలు పోయడం, చిన్న చిన్న సొట్టలు తీయడం నేర్చుకొన్నాను. ఆయన నేర్పాడు చాలా మంచివాడు లెండి. ఆయన భార్య కూడా నన్ను బిడ్డను చూసినట్లు చూసుకునేది”అన్నాడు రజాక్.

క్రమంగా రజాక్ ఈ పనిలో వున్న మెలకువలన్నీ తెలుసుకున్నాడు.

“పాత్రలకు సొట్టలు వేయడం వో ఆర్టు. అడుగున మోపు పెట్టి, పొడ సుత్తితో మెల్లిగా తీయాలి. రేకు బిరుసెక్కి సొట్ట తీసేటప్పుడు చీరుకుపోతుంది. అప్పుడు దాన్ని కచ్చాపచ్చాగా కాల్చాలి. చిన్న చిన్న చిల్లుల్ని ఇత్తడి టంకంతో అతుకుతా. పెద్ద కన్నాలుంటే ఆ కన్నానికి సరిపడే మరో రేకును మాటు వేసి, టంకంతో అతుకుతా”అన్నాడు రజాక్.

కళాయి పెట్టాలంటే పాత్రల్ని బాగా తోమాలన్నాడు. కిలుం పట్టిన పాత్రలకు కళాయి అంటదన్నాడు. గుండ్ర ఇసుకతోనూ, చింతపండుతోనూ రుద్దాలన్నాడు.

“అలా రుద్దిన తరువాత, కొలిం మీద పెట్టి కాలుస్తా. కాస్త వేడెక్కాక నవాసాగరం పొడి

చల్లుతా. చల్లి ఓ పాత గుడ్డతో ఆ పొడిని వేడిగా వున్న ప్రాంతంలో రుద్దుతా. తరువాత తగరం పలుకులు వేస్తా. అది కరిగాక, గుడ్డముక్కతో ఆ తగరాన్ని వేడిగా వున్న పాత్ర లోతట్టుకు పాముతాను'' అన్నాడు రజాక్.

ఇదివరకు ఒక్కమాటు వేస్తే పావలా తీసుకునేవాడిని, ఇప్పుడు గిట్టుబాటు కావడంలేదని అంటున్నాడు రజాక్.

''బొగ్గులు, నవాసాగరం, తగరం ధరలు మండిపోతున్నాయండి. రేటు పెంచకపోతే గిట్టదు. పెంచితే గిరాకి ఉండదు. అందులోనూ పోటీ ఉన్నదనుకోండి. అదీగాక మా పనితో ప్రతి కుటుంబానికి అవసరం ఉంటుంది. కాని ఏ రెండు మూడేళ్ళకోగానీ, ఆ అవసరం రాదు. అందులో నేను చేసిన పని అయితే మూడు నాలుగేళ్ళదాకా ఢోకా ఉండదు'' అన్నాడు రజాక్.

అతను జహంగీర్ తమ్ముడి కూతుర్నే పెళ్ళి చేసుకున్నాడు. ఓ కొడుకు. వాడికి 'జహంగీర్' అన్న పేరే పెట్టుకున్నానన్నాడు.

''అన్నం పెట్టినవాడిని మార్చిపోతానా సార్'' అన్నాడు రజాక్.

ఓ మూలగా సొట్టలుపోయీ, లొట్టలుపోయీ ఉన్న సామాను, చిందర వందరగా పడి వుంది. ఒక్కోదాన్ని తీసుకుని కాయకల్ప చికిత్స చేసి కొత్త రూపం ఇచ్చి మరో పక్కన పెడుతున్నాడు రజాక్.

''రోజుకేపాటి సంపాదిస్తావ్!'' రజాక్ నవ్వాడు.

''ఒక్కోరోజున నాటుగ్గూడా దొరకవు. ఏ హొటల్ కన్నా కాంట్రాక్టు తీసుకున్నాననుకోండి, మూడు నాలుగు వందల రూపాయల పని దొరుకుతుంది. వారం రోజులకల్లా పూర్తి చేస్తాను... పస్తులుండడం లేదుగానీ సార్, డొక్కలెగిసేటట్లు తినడానిక్కూడా ఉండదండి!'' అన్నాడు రజాక్ నవాసాగరం పొడిని పాత్ర మీద చిమ్ముతూ.

గుప్పుమని మాటుగా వుండే పొగసుడులు లేచాయి.